క్లుప్తంగా

ఘనంగా ఉరుసు



ఫాతెహాలు సమర్పిస్తున్న భక్తులు

గోనెగండ్ల: పెద్దమరివీడు గ్రామంలో శ్రీ జగద్గురు దస్తగిరి స్వామి ఉరుసు సోమవారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచే భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఎస్‌ఐ తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

రామళ్లకోటలో రెండు బంకుల్లో నిప్పు

వెల్దుర్తి: రామళ్లకోట ప్రధాన రహదారిలోని రెండు బంకులకు గుర్తుతెలియని దుండగులు నిప్పుపెట్టారు. ఆదివారం రాత్రి సిండికేట్ బ్యాంక్ సమీపంలోని లక్ష్మన్నకు చెందిన బంకులో మంటలు రావడంతో స్థానికులు ఆర్పేశారు. టేబుళ్లు, చిన్న చిన్న వస్తువులు దగ్ధమయ్యాయి. మరి కొద్ది సేపటికి సమీపంలోని మహబూబ్ బాషాకు చెందిన కిరాణం బంకులో మంటలు వ్యాపించాయి. మంటలు ఆర్పే లోపు అందులోని కిరాణ సరుకులు మొత్తం కాలిపోయాయి. విషయం తెలుసుకున్న ఏఎస్‌ఐ బాలకృష్ణ సోమవారం సంఘటన స్థలానికి చేరుకుని విచారించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



యూఎస్‌ఎఫ్‌ఐ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ, విద్యార్థి సంఘ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక ఎంఆర్సీలో సోమవారం యూఎస్ఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎంఈఓ ఆంజినేయులు ఆవిష్కరించారు. చదువుతో పాటు సామాజిక కార్యక్రమాలపై విద్యార్థి సంఘాలు దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర కో కన్వీనర్ ఉదయ్, నాయకులు సందీప్, చందు, వంశీ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



శివకుమార్ (ఫైల్)

వెల్దుర్తి: స్థానిక 6వ వార్డులో నివసిస్తున్న శివకుమార్ (39) గత శుక్రవారం నుంచి కనిపించడం లేదు. అతని భార్య వెంకటేశ్వరమ్మ తెలిపిన వివరాల ప్రకారం బండ పరుపు కూలీగా పనిచేసే ఇతను శుక్రవారం రాత్రి బయటకు వెళ్లి ఇంటికి తిరిగి రాకపోవడంతో అంతటా గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో సోమవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మిత్రుడి కుటుంబానికి పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

పత్తికొండ రూరల్: ఇటీవల విద్యుదాఘాతంతో మృతి చెందిన బాశ్యం వెంకటరెడ్డి కుటుంబానికి పత్తికొండకు చెందిన జూనియర్ కళాశాల 2000–02 విద్యార్థులు ఆర్థిక సాయం అందజేశారు. ఇద్దరు ఆడపిల్లలు, ఒక కుమారుడు సంతానం కాగా రెండో కుమార్తెకు మతి స్థిమితం సరిగా లేదు. మిత్రుడి కుటుంబ సమస్యలను తెలుసుకున్న మిత్రబృందం సోమవారం ప్యాపిలి మండలం పిఆర్‌పల్లెకు వెళ్లి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి అతని భార్యకు రూ.30వేలు నగదు అందజేశారు.

వాల్మీకి మహర్షి క్యాలెండర్ల విడుదల

పత్తికొండ రూరల్ : స్థానిక పబ్లిక్ రీడింగ్ రూం ఆవరణలో శ్రీవాల్మీకి మహర్షి నూతన సంవత్సరం–2023 క్యాలెండర్లను ఆ సంఘం జాతీయ కార్యదర్శి ఆస్పరి శ్రీనివాసులు ఆధ్వర్యంలో నాయకులు విడుదల చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సోమశేఖర్, చక్రాళ్ల సర్పంచు పూరి శ్రీరాములు, ఏపీఎన్జీవో నాయకుడు ఆస్పరి సాయిబాబ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను అవమానిస్తే దేశ ద్రోహి కేసు నమోదు చేయాలి

గోనెగండ్ల: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవమానించే వారిపై దేశద్రోహి కేసు నమోదు చేయాలని ఎమ్మార్పీఎస్ తాలూకా ఉపాధ్యక్షుడు ప్రేమ కుమార్, రాజేష్‌లు డిమాండ్ చేశారు. ఆదివారం వారు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ తిమ్మారెడ్డికు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్‌ను అసభ్యకరంగా మాట్లాడి, అవమానించిన రాయలసీమ యూనివర్సిటీ అధికారులపై పోలీసులు నామ మత్రంగా కేసు నమోదు చేసి చేతులు దులుపుకోవడం తగదన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు దేవదాసు, అశోక్, తిప్పన్న తదితరులు పాల్గొన్నారు.

మిన్నంటిన సంక్రాంతి సంబరాలు

పల్లెల్లో సంక్రాంతి సంబరాలు మిన్నంటాయి. ఇళ్ల ముంగిట రంగు రంగుల ముగ్గులు కళకళలాడగా.. పిండి వంటలు ఘుమఘుమలాడగా.. బంధుమిత్రులు సందడి చేశారు. సంకాంత్రి పర్వదినం సందర్భంగా ఆదివారం ఉదయం ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఆ తర్వాత ఆటల పోటీలు, ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలు బహుమతులు అందజేశారు. సోమవారం కనుమ వేడుకలను ఘనంగా నిర్వహించారు.



వెల్దుర్తి మండలం పుల్లగుమ్మిలో గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



ఆస్పరి మండలం కైరుప్పలలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం



హెచ్ కైరవాడిలో బహుమతులను అందజేస్తున్న ఎస్‌ఐ తిమ్మారెడ్డి



వెల్దుర్తిలో త్రైతసిద్ధాంత ప్రచారం నిర్వహిస్తున్న దోన్ కమిటీ ప్రతినిధులు



మద్దికెరలో ఆకట్టుకున్న ముగ్గు



రామలింగాయపల్లిలో విజేతలకు బహుమతులు అంజేస్తున్న నబిరసూల్



హాలహర్విలో ..

వెల్దుర్తి: పుల్లగుమ్మిలో గరుడ వాహనంపై నిర్వహించిన సీతారామలక్ష్మణుల గ్రామోత్సవం కనుల పండువగా సాగింది. ముందుగా ఆలయ ధర్మకర్త, వైఎస్సార్‌సీపీ నాయకుడు నాగార్జునరెడ్డి, వెంకటేశ్వర్లు, అచ్యుతానందరెడ్డి, గ్రామస్తులు స్వామి అమ్మ వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుల్లగుమ్మిలో అవధూత రామిరెడ్డి తాత ఆరాధనోత్సవం జరిగింది. వెల్దుర్తి వంక బ్రిడ్జ్ నుంచి బ్రహ్మగుండం వైపు జరిగిన నిమ్మకాయ విసిరే పందేలు ఆకట్టుకున్నాయి.

ఆస్పరి: కైరుప్పల, తురువగల్లు గ్రామాల్లో సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలకు విశేష స్పందన లభించింది. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనగా విజేతలకు సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గిడ్డయ్య ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఆస్పరిలో యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలలో ఆస్పరి జట్టు ప్రథమ స్థానంలో నిలిచి రూ.20,116, రెండవ స్థానంలో నిలిచిన ఆదోని జట్టుకు రూ.10,116 అందజేశారు.

పత్తికొండ రూరల్: దూదేకొండ గ్రామంలో సీపీఐ రైతు సంఘం తాలుకా కార్యదర్శి ఈరన్న ఆధ్వర్యంలో ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించి ఆపార్టీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి రామచంద్రయ్య చేతుల మీదుగా విజేతలకు బహుమతి ప్రదానం చేశారు.

గోనెగండ్ల: హెచ్ కైరవాడిలో వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు, నృత్యాలు గ్రామస్తులను ఆకట్టుకున్నాయి. విజేతలకు ఎస్‌ఐ తిమ్మారెడ్డి, ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు బందెనవాజ్, మోహన్ రెడ్డి, పులికొండ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నందవరం: నందవరంతో పాటు నాగలదిన్నె, గురజాల, జోహారాపురం, నదికైరవాడి, ఇబ్రహీంపురం, కనకవీడు, ముగతి తదితర గ్రామాల్లో సంక్రాంతి పండుగ ఘనంగా నిర్వహించారు. పిల్లలు ఆయు రారోగ్యాలతో జీవించాలని భోగి పండ్లతో చిన్నారుల తలపై పోసి దీవించారు.

మద్దికెర: మద్దికెర, పెరవలి, ఎం.అగ్రహారం ఆయా గ్రామాల్లో ఆదివారం సంక్రాంతి పండుగను బంధువులు, స్నేహితుల మధ్య సంబరాలు ఘనంగా నిర్వహించుకున్నారు.

తుగ్గలి: సంక్రాంతి పండుగ సందర్భంగా రామలింగాయపల్లిలో సీపీఐ నాయకులు నబీ రసూల్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అదే విధంగా అమినాబాద్‌లో ముగ్గుల పోటీలు నిర్వహించారు.

హాలహర్వి (ఆలూరు రూరల్): హాలహర్వి మండంలోని హర్దగేరి గ్రామంలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో ఆంధ్రా, కర్ణాటక రాష్ట్రాల నుంచి వివిధ గ్రామాల 26 జట్లు పాల్గొన్నాయి. మొదటి స్థానంలో గెలుపొందిన ఎర్రంగిణి జట్టుకు సొసైటీ ప్రెసిడెంట్ శ్రీనివాసులు రూ.15 వేలు బహుమతి అందజేశారు. రెండవ స్థానంలో నిలిచిన హర్దగేరి గ్రామ జట్టుకు గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు కర్ణ రూ.10 వేలు నగదు అందించారు. మూడవ స్థానంలో నిలిచిన జట్టుకు గ్రామ సర్పంచ్ గురుదాస్ రెడ్డి రూ.5 వేలు బహుమతి కింద నగదు ప్రదానం చేశారు. గ్రామస్తులు చంద్రకాంత్ రెడ్డి, రామాంజిని, గోపాల్ గ్రామస్తులు ఉన్నారు.

వెల్దుర్తి: సంక్రాంతి పురస్కరించుకుని మండల పరిధిలోని శ్రీరంగాపురం గ్రామంలో సోమవారం డోన్ హిందూ జ్ఞాన వేదిక త్రైత సిద్ధాంత ప్రభోద సేవా సమితి ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా త్రిమత గురువు, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు గ్రహీగ ఆచార్య ప్రభోదానంత యోగీశ్వరుల వారు రచించిన 100రకాల ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాలను ప్రజలకు పంపిణీ చేస్తూ ప్రచారం చేశారు.

సిద్ధేశ్వరస్వామి జాతర పోస్టర్ విడుదల



పోస్టర్లను విడుదల చేస్తున్న ఆలయ ధర్మకర్తలు, గ్రామపెద్దలు

హొళగుంద: మండల ప్రజల ఆరాధ్యదేవుడిగా పూజింపబడుతున్న హొళగుంద శ్రీ సిద్దేశ్వరస్వామి జాతర వాల్‌పోస్టర్లను సోమవారం ఆలయ ధర్మకర్తలు రాజ పంపన్నగౌడ్, సిద్ధార్థగౌడ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా పంపన్నగౌడ్ మాట్లాడుతూ సిద్దేశ్వరస్వామిని ఎంతో మహిమ కలిగిన దేవుడిగా భక్తులు కొలుస్తారని, ఈ నెల 26 నుంచి మొదలయ్యే జాతర ఉత్సవాలకు అన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కోట్రేశ్, ఊకూరు కాడసిద్దప్ప, అమరేశ్, మురళి, కుమారస్వామి, డాక్టర్ జగదీశ్, రేణుస్వామి, హోటల్ రాజా, సిద్దప్ప, పెద్యాట మల్లయ్య, శ్రీధర్‌శెట్టి, రాఘవేంద్ర, బసవ, సిద్ధేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఘర్షణలకు పాల్పడితే చర్యలు



నాగలదిన్నెలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ మహేష్‌కుమార్

నందవరం : ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ మహేష్‌కుమార్ హెచ్చరించారు. ఆదివారం మండల పరిధిలోని నాగలదిన్నె, ఇబ్రహీంపురం, పెద్ద కొత్తిలి గ్రామాల్లో గ్రామస్తులతో ఎస్‌ఐ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెలో గుట్కా, పేకాట, బెల్టు షాపులు తదితర కార్యకలాపాలు నిర్వహిస్తే జైలు శిక్ష తప్పదన్నారు. గ్రామాల్లో అందరూ ప్రశాంతంగా జీవించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు.

నీటి సమస్యను పరిష్కరించండి

గోనెగండ్ల: మండల కేంద్రం గోనెగండ్లలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని మొట్టివీధిలో కాలనీ మహిళలు ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. గ్రామానికి సరఫరా చేసే ఎస్ఎస్ ట్యాంక్‌లో నీరు ఉన్నప్పటికీ నాలుగు రోజులుగా రావడం లేదన్నారు. నీటి సమస్య ఉన్నప్పటికీ గ్రామ సర్పంచ్, అధికారులు ఎవరు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి గోనెగండ్లలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.

జింకను తప్పించబోయి...



మృతుడు జోలాపురం నారాయణస్వామి

మద్దికెర: మండల కేంద్రమైన మద్దికెర గ్రామానికి చెందిన నారాయణస్వామి అనే వ్యక్తి జింకను తప్పించబోయి తీవ్రంగా గాయపడి మృతి చెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. జోలాపురం నారాయణస్వామి (55) ఇంటి నిర్మాణాల మేస్త్రీగా పనిచేస్తూ జీవనం చేస్తున్నాడు. ఆదివారం బొమ్మనపల్లి గ్రామానికి బైక్‌పై వెళుతుండగా రోడ్డు పైకి అకస్మాత్తుగా జింక అడ్డురావడంతో తప్పించబోయి అదుపు తప్పి కింద పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం అనంతపురానికి తరలించగా కోలుకోలేక సోమవారం సాయంత్రం మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. మృతునికి భార్య ఉమాదేవి, నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు వున్నారు.

రస్తా విషయంలో ఘర్షణ

కృష్ణగిరి: మండల పరిధిలోని బాపనదొడ్డి గ్రామంలో రెండు కుటుంబాల మధ్య రస్తా విషయంలో ఘర్షణ జరిగింది. ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన షేక్ ఇస్మాయిల్, రామలింగారెడ్డి కుటుంబాల మధ్య కొంత కాలంగా ఇంటి వద్ద రస్తా విషయంలో వివాదం ఉంది. ఈ క్రమంలో సోమవారం మరోమారు గొడవ జరిగింది. షేక్ షాలుపై నరసింహారెడ్డితోపాటు మరో నలుగురు దాడి చేశారని బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

పుల్లగుమ్మి బుగ్గ ముఖద్వారం ప్రారంభం



కొత్తగా ఏర్పాటు చేసిన ముఖద్వారం

వెల్దుర్తి: మండల పరిధిలోని పుల్లగుమ్మి గ్రామ బుగ్గ రామలింగేశ్వర స్వామి, వీరాంజనేయస్వామి దేవస్థానాలకు నూతనంగా నిర్మించిన ముఖద్వారం సోమవారం ప్రారంభించారు. ఈ ద్వారాన్ని గ్రామానికి చెందిన శ్రీనివాసులు సొంతంగా రూ.40వేలు ఖర్చు చేసి ఏర్పాటు చేశాడు. గురుస్వాములు, శివస్వాముల చేతులమీదుగా జరిగిన ప్రారంభ కార్యక్రమంలో గ్రామపెద్దలు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీల్లో జిల్లాకు కాంస్యం



కాంస్య పతకం సాధించిన కర్నూలు జట్టు

కర్నూలు (టౌన్): ఈనెల 13, 14 తేదీల్లో కృష్ణా జిల్లా గన్నవరంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి జూనియర్ హ్యాండ్‌బాల్ బాలుర పోటీల్లో కర్నూలు జిల్లా జట్టు కాంస్యం కైవసం చేసుకుంది. రాష్ట్రస్థాయిలో కాంస్య పతకం సాధించిన క్రీడాకారులను ఆంధ్రప్రదేశ్ హ్యాండ్‌బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, ఒలంపిక్ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు సోమవారం అభినందించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో పతకం సాధించడంతో పాటు జాతీయ జట్టులో ముగ్గురు క్రీడాకారులకు అవకాశం రావడం హర్షించదగ్గ విషయమన్నారు.

ఈరన్న స్వామికి అభిషేక పూజలు



పూజలందుకుంటున్న ఈరన్నస్వామి

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్నస్వామి దేవాలయానికి సోమవారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి, ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. సోమవారం సెలువు రోజుతో పాటు ఆదివారం సంక్రాంతి, సోమవారం కనుమ పండుగలు ఉండడంతో భక్తుల రద్దీ అధికంగా కనిపించింది. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారు జామున సుప్రభాతసేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫలపుష్పాలతో అలంకరించారు. అనంతరం భక్తుల్ని దర్శనానికి వదిలారు. భక్తులు పిండి వంటలు వండి స్వామికి నైవెద్యం సమర్పించారు.

నీలం సాయినగర్‌లో భారీ చోరీ



బీరువా పగులగొట్టి చోరీ చేసిన దృశ్యం

కర్నూలు: కర్నూలు శివారులోని పెద్దపాడు రోడ్డులో గల నీలం సాయినగర్‌లో భారీ చోరీ జరిగింది. వడ్డె సురేష్‌కుమార్ అనే వ్యక్తి సౌదీ అరేబియాలో ఉద్యోగం చేసి ఇటీవల కర్నూలులోని నీలం సాయి నగర్‌లో నివాసముంటున్నాడు. మూడు రోజుల క్రితం సంక్రాంతి పండుగ కోసం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలసి స్వగ్రామం హెచ్.కైరవాడికి వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దొంగలు మెయిన్ డోర్‌కు వేసిన తాళాలు పెకిలించి లోపలికి వెళ్లి పడక గదిలో ఉన్న బీరువాను బద్దలుకొట్టి అందులో ఉన్న 10 తులాల బంగారం, 50 తులాల వెండి, రూ.3 లక్షల నగదు మూటగట్టుకుని ఉడాయించారు. సురేష్ కుమార్ సోమవారం ఇంటికి వచ్చేసరికి తలుపులు తెరచివున్నాయి. గదిలోకి వెళ్లి చూడగా బీరువాలోని సామాన్లన్నీ చిందరవందరగా పడి ఉండటంతో చోరీ జరిగిందని నిర్ధారించుకుని పోలీసులకు సమాచారమిచ్చారు. నాలుగవ పట్టణ ఎస్‌ఐ మోహన్‌కిషోర్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. క్లూస్ టీమ్‌ను రప్పించి ఆధారాలను సేకరించారు. బాధితుడు సురేష్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దొంగల కోసం గాలిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైలు కింద పడి వృద్ధురాలి ఆత్మహత్య

కర్నూలు: కర్నూలు రైల్వేస్టేషన్ శివారులోని అలంపూర్‌కు వెళ్లే దారిలో 240/4.5 కిలోమీటర్ వద్ద రైలు కింద పడి గుర్తు తెలియని వృద్ధురాలు ఆత్మహత్య చేసుకుంది. సోమవారం మధ్యాహ్నం ఏపీ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే పోలీసులు అనుమానిస్తున్నారు. మృతురాలి వయసు50 నుంచి 55 సంవత్సరాల మధ్య ఉంటుందని, ఎత్తు 5 అడుగులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కర్నూలు రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ కె.వై.సంజన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు రైల్వే ఎస్‌ఐ సురేష్ బాబు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీకి తరలించారు. మృతురాలు లేత గులాబీ రంగు చలి కోటు, వంకాయపూత రంగు జాకెట్, ముదురు వంకాయ పూత రంగు, తెల్లటి ఆకుపచ్చ డిజైన్ ఉన్న చీర ధరించింది. మృతురాలికి సంబంధించిన వివరాలు తెలిసినవారు 94407 56043 నంబర్‌ను సంప్రదించాలని ఎస్‌ఐ సురేష్ బాబు కోరారు.

రామిరెడ్డి తాత ఆరాధనోత్సవాలు

కల్లూరు: అవధూత రామిరెడ్డి తాత సేవలు చిరస్మరణీయమని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. సోమవారం కల్లూరులో సేవ సంస్థాన్ అధ్యక్షుడు దాసరి రామచంద్ర రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరాధనా మహోత్సవాల ప్రారంభ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా తాత విగ్రహానికి పంచామృతాభిషేకం, విశేష పూజలు నిర్వహించి సమాధిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. స్వామి వారి చిత్రపటాన్ని పల్లకీపై ఉంచి భజనలు చేస్తూ, కోలాటాలు, నృత్యాలు మధ్య కల్లూరు పురవీధుల గుండా ఊరేగించారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కల్లూరు లో జన్మించిన దత్తాంశ సంభూతుడైన రామిరెడ్డి తాత ఈ ప్రాంతాన్ని పావనం చేశాడన్నారు. టీడీపీ పాణ్యం ఇన్‌చార్జ్ గౌరు చరితా రెడ్డి, వెంకటరెడ్డి, బీజేపీ నేత బైరెడ్డి శబరిరెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులందరికీ సేవా సంస్థాన్ సభ్యులు అన్నదానం చేశారు. కార్పొరేటర్లు మైతాపు నరసింహులు, సాన శ్రీనివాసులు, దండు లక్ష్మీకాంతరెడ్డి, ఎరుకల వెంకటేశ్వర్లు, సంస్థాన్ కోశాధికారి హనుమంతురెడ్డి, పీఠాధిపతులు సుబ్రహ్మణ్యం, ఎల్లప్ప స్వామి తదితరులు పాల్గొన్నారు.

బాలల దురలవాట్లపై ప్రత్యేక దృష్టి

కర్నూలు(రాజ్‌విహార్): బాలలు దురలవాట్లు, వ్యసనాలకు గురికాకుండా ప్రత్యేక దృష్టి సారించాలని నేషనల్ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ రీసెర్చ్ (న్యూఢిల్లీ) మెంబర్ సెక్రెటరీ రూపాలి బెనర్జీ సింగ్ సూచించారు. సోమవారం ఆమె ఢిల్లీలోని తన కార్యాలయం నుంచి ఆన్‌లైన్ ద్వారా బాలల సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశం నిర్వహించారు. చిన్నారులు డ్రగ్స్, మద్యం, మాదక ద్రవ్యాలు వంటి దురలవాట్లకు గురి కాకుండా చూడాలన్నారు. సమావేశంలో స్త్రీ, శిశు సంక్షేమ, వైద్య ఆరోగ్య, విద్యా, పోలీసు, వివిధ శాఖల అధికారులు ఆన్‌లైన్ ద్వారా పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన జిల్లా వక్ఫ్‌బోర్డ్ కమిటీ సభ్యులు



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జిల్లా వక్ఫ్‌బోర్డ్ చైర్మన్

ఎమ్మిగనూరుటౌన్: జిల్లా వక్ఫ్‌బోర్డు నూతన కమిటీకి నియమితులైన చైర్మన్ నియాజ్ అహమ్మద్, ఉపాధ్యక్షులు రియాజ్ అహమ్మద్, డైరెక్టర్ అమాన్‌లు సోమవారం ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం జిల్లా కేంద్రంలో జరుగనున్న జిల్లా వక్ఫ్ బోర్డు నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి వారు ఎమ్మెల్యేను ఆహ్వానించారు.

నేడు కొత్తపల్లిలో దేవర

మద్దికెర: మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో మంగళ, బుధవారాల్లో సుంకులమ్మ దేవి దేవర ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు సోమవారం తెలిపారు. మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, రాత్రి ఊరేగింపు కార్యక్రమాలు వుంటాయన్నారు.

నేడు మాచాపురంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

ఆలూరు: దేవనకొండ మండలం మాచాపురం గ్రామంలో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. మంత్రి గుమ్మనూరు జయరాం గ్రామంలో పర్యటించి ప్రజా సమస్యలను పరిష్కరించడం, సంక్షేమ కార్యక్రమాలను వివరించనున్నారు. 18న పాలకుర్తి గ్రామంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గ్రామ సర్పంచ్ ప్రతాప్ సుధమ్మ తెలిపారు.

19న మోడల్ కానిస్టేబుల్ పరీక్ష

మద్దికెర: రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేసే కానిస్టేబుల్ పోస్టులకు సంబంధించి ఆపద్బాంధవ సేవా సమితి ఆధ్వర్యంలో ఈనెల 19న స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఉదయం 10 గంటలకు మోడల్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు చొక్కా సునీల్ కుమార్ సోమవారం తెలిపారు. పరీక్ష రాసే అభ్యర్థులు ముందుగా 8247452174, 9985210169 ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

ముగిసిన ధనుర్మాస పూజలు



పల్లకీలో ఊరేగుతున్న శ్రీరంగనాథుడు

మద్దికెర: పెరవలి గ్రామంలోని శ్రీరంగనాథస్వామి ఆలయంలో ఆదివారంతో ధనుర్మాస పూజలు ముగిసినట్లు ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధాన అర్చకులు రంగస్వామి తెలిపారు. ధనుర్మాస పూజల సందర్భంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, అష్టోత్తర నామార్చన, కుంకుమార్చన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి ఉత్సవమూర్తులను దేవాలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తులను పల్లకీలో కొలువుంచి మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించారు.

ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపిద్దాం

ఎమ్మిగనూరుటౌన్: పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు గెలుపునకు అన్ని వర్గాలు కృషి చేయాలని సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు గిడ్డయ్య, గౌసదేశాయ్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. మార్చి నెలలో జరిగే ఎంఎల్సీ ఎన్నికల్లో వీరిని గెలిపిస్తే సమస్యలపై శాసన మండలిలో తమ వాణి వినిపించి ప్రజా, ఉద్యోగ, యువత సమస్యల పరిష్కారానికి సహకారం అందిస్తారని తెలిపారు. సమావేశంలో ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్నరాజు, నాయకులు బసవరాజు, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నాగమణి, జిల్లా అధ్యక్షుడు ఎల్లప్ప, ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి జి.రంగన్న, సీఐటీయూ, ఏఐటీయూసీ, పలు విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

డంప్‌యార్డులో మంటలు



మంటలు ఆర్పుతున్న దృశ్యం

హొళగుంద: స్థానిక పెద్ద చెరువు మీద ఉన్న సాలీడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్ (చెత్త సేకరణ కేంద్రం) వద్ద నిల్వ చేసిన చెత్తకు ఆదివారం మంటలు వ్యాపించాయి. సమీపంలోని గడ్డివాములకు మంటలు వ్యాపించకుండా పోలీసులు సకాలంలో స్పందించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. చెత్తకు మంటలు వ్యాపించి దట్టమైన పొగ వ్యాపించడంతో వెంటనే విషయం తెలుసుకున్న సర్పంచ్ కుమారుడు పంపాపతి, పోలీసులు అక్కడికెళ్లి ట్యాంకర్లు పెట్టి మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. అలాగే ఆలూరు ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు.